

# నేను - నా జ్ఞాపకాలు

## – జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 20ఆ9*

*(గత సంచిక తరువాయి)*

## నాకు జ్ఞాపకం లేని "ఆ అరవై రోజులు"

అమ్మ ప్రదర్శించిన ఆత్మస్థైర్యం నాకు కొండంత బలాన్ని ఇచ్చింది.

నా స్మృతి

*(70వ పుట్టిన రోజు) సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 2010లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ మరియు ఢిల్లీ తెలుగు అకాడమీ వెలువరించిన అభినందన సంచికలో ప్రచురించబడిన కొందరు ప్రముఖుల సందేశాలు, నా కుటుంబ సభ్యుల అభిప్రాయాలు*

### ***కథలో కమిటయ్యే రచయిత జీడిగుంట***

కథ రాయటం ఆర్టు. అందమైన ఆర్టు.

రాసేవాడికి చేతినిండా పనితోపాటు, మెదడు నిండా ఆలోచనలుంటాయి. అవి ఇచ్చే 'కిక్కు'లో ఆకలుండదు, దాహముండదు. అంచేత రాసే పెద్దమనిషి ఈ బాధల్ని బొత్తిగా పట్టించుకోడు. తన గొడవ తనదే. తన ప్రపంచం తనదే. అంచేత 'రచయిత' అనేవాడు అదృష్టవంతుడని శాస్త్రం చెప్తోంది.

కథలు రాసే వాళ్ళల్లో కూడా రకాలుంటారు. కుర్రతనంతో దంచిపారేసి తర్వాత పెళ్ళాం పిల్లలూ, సంసారం ఇత్యాది గొడవల్లో పడి రచనకు 'గుడ్‌బై' చెప్పినవాళ్ళు నాకు తెలుసు. తమాషాగా నాలుగైదు కథలు రాసి పెన్ను జేబులో పెట్టేసుకున్న ఫ్రెండ్సుని కూడా నేనెరుగుదును. 'గిట్టుబాటు కాని బేరం' మనకెందుకు లెమ్మని స్వస్తి పలికినవాళ్ళూ నాకు తెలుసు. అలాగే బద్దకం బలిసిపోగా 'చాల్లెద్దూ' అని అస్త్రసన్యాసం చేసిన మహానుభావుల చిరునామాలు కూడా నా దగ్గరున్నాయి. కొందరు మాత్రం బ్రతికినంతకాలమూ రాస్తూనే వుంటారు 'నిద్రా భోజనం ఎలాగో రాయటం కూడా అలాగే' అని ఎంచుకుని రాస్తూ అందులోనే అనిర్వచనీయమైన ఆనందం పొందే రచయితలు వీళ్ళు. రాయకపోతే, కాలో చెయ్యో పడిపోయినట్టుగా వుంటుంది ఈ బాపతు వాళ్ళకి.

ఆ తరహా రచయితల్లో మిత్రులు జీడిగుంట రామచంద్రమూర్తి కూడా ఒకరు. గత యాభై ఏళ్ళుగా రాస్తూనే వున్నారు. ఇంకా ఇంకా రాస్తూనే వుంటారు. మూర్తిగారితో మీకు పరిచయం వుందో లేదో నాకు తెలీదు. ఒకవేళ లేకపోతే ఓసారి ఆయన్ని కలవండి. ఆయన మాట్లాడే అరగంటలో పాతిక నిమిషాలు కేవలం కథల గురించే వుంటాయని 'బాండ్ పేపరు' మీద రాసివ్వగలను. ఇష్టమైన వంటకాన్ని ఊరిస్తూ వల్లించి చెప్పే పెద్ద మనిషిగా రామచంద్రమూర్తి ఏ కథ చెప్పినా ఊరిస్తూనే చెప్తారు. ఆ కథలో పూర్తిగా కమిటైపోతారు. ఆ పాత్రల్లో అందులోని సంఘటనల్లో తానూ ఒకరయిపోతారు. కథంటే అంతిష్టం ఆయనకి.

చెప్పిన కథను చెప్పినట్టు కాకుండా మరోలా మరోలా ఎన్నోసార్లు తమ మిత్రులకు చెప్పి ఆఖర్న అందరూ బాగుందన్నాక అప్పుడు కాగితం మీద పెట్టటం ఆయనకు అలవాటు. ఆయన రాసిన ప్రతి కథా మానవ సంబంధాలతోటీ, మానవీయ విలువలతోటీ ముడిపడి ఉంటుంది. వినేవారికీ, చదివేవారికీ అందమైన అనుభూతిని మిగులుస్తుంది.

***ఆదివిష్ణు.***

**'మానవతామూర్తి' మానవీయ స్పందన స్ఫూర్తి.**

జీడిగుంట రామచంద్రమూర్తి నా అభిమాన రచయిత. వారితోనూ, వారి కుటుంబ సభ్యులతోనూ నాకున్న అనుబంధపు వయసు కొన్ని దశాబ్దాలు. ఆకాశవాణి కేంద్రంలో స్క్రిప్టు రైటర్‌గా వున్నప్పటినుంచీ ఆయన రచనలను అమితంగా అభిమానించేదానిని. 1980 ప్రాంతాల్లో అనుకుంటాను, 1974లో నేను వ్రాసిన 'రంగుటద్దాలు' నవలని రామచంద్రమూర్తిగారు రేడియో నాటికగా రూపకల్పన చేశారు. ఆ నాటిక కూడా ఎంతో ప్రజాదరణ పొందింది.

రామచంద్రమూర్తిగారు కమర్షియల్ రైటర్ కాదు. ఊహల్లో విహరించే, విహరింపజేసే రచనలు ఆయనెప్పుడూ చేయలేదు. హృదయం స్పందిస్తేనే వ్రాస్తారు. ఆ రచనకు సామాజిక పరమైన ప్రయోజనం వుండి తీరుతుంది. అలాగే ప్రతీ రచనలోనూ నిజాయితీతో కూడిన సంస్కరణాభిలాష తొంగిచూస్తూ వుంటుంది. మానవత్వపు విలువలతో బాటు పెల్లుబికే మమతా వాత్సల్యాలు వుంటాయి. సమకాలీన సమస్యలూ ఉంటాయి. వాటికి పరిష్కారమార్గాలుంటాయి. రామచంద్రమూర్తిగారు వెలువరించిన "అమ్మకోముద్దు" కథల సంపుటిని ఇటీవలే చదివాను.

మొదటి కథ 'అమ్మకోముద్దు' చదవటం పూర్తయ్యాక ఆర్ద్రతతో కళ్ళు చెమర్చాయి. అనిర్వచనీయమైన స్పందనకూ, ఉద్వేగభరితమైన అనుభూతికీ లోనయ్యాను. చక్కని కుటుంబ వ్యవస్థ కోసం అన్వేషించే రోజులివి. అన్వేషించినా అరుదుగానే చూడగల దౌర్భాగ్యస్థితిలో మనమున్నాం. ఆ కథలు చదువుతుంటే మనసు ప్రేమ పూరితమై ఎంతో మానసిక ప్రశాంతత కలుగుతుంది. నిండైన కుటుంబ వ్యవస్థలో, ఆప్యాయతాను రాగాలు వెల్లివిరిసే అందమైన పొదరింటిలో, అన్నదమ్ముల మధ్యన ప్రేమానురాగాలు ఇంత బలవత్తరంగా వుండాలి. దాంపత్యానికి నిజమైన నిర్వచనం ఇంత పవిత్రంగా వుండాలి. భార్యాభర్తల మధ్య వుండే బంధం ఆత్మపరమాత్మల ఏకత్వానికి ప్రతీకగా ఉండాలి. అవును. ఇలా వుండాలి. ఇలాగే వుండాలి.

రామచంద్రమూర్తిగారి ఆశయాలు, కలలు కాకూడదనే ఆశ మన హృదయాలను చిత్రంగా స్పందింపజేస్తుంది. ఆ కథలు చదివిన వెంటనే రామచంద్రమూర్తిగారికి ఫోన్ చేసి ఆహ్లాదభరితమైన నా హృదయ స్పందనను అందజేశాను.

***డా.కె.వి కృష్ణకుమారి.***

## రచనకు రామచంద్ర కీర్తి

'ఆకాశవాణి, వార్తలు.. ఇంతటితో సమాప్తం. అని మధ్యాహ్నం పూట రేడియో చెప్పగానే కార్మికుల కార్యక్రమం సిగ్నేచర్ ట్యూన్. ఆ వెనుకనే ఏదో ఒక వెటకారంతో ఒక ఆడగొంతు. అది చిన్నక్కది. ఆ వెంటనే మరో వెటకారంతో ఇంకొక గొంతు. అది ఏకాంబరానిది. చిన్నక్క, ఏకాంబరాల వెటకారం మాటలు చినికి చినికి గాలివాన అవుతుంటే మరో పెద్దమనిషి గొంతు.. అది బాలయ్యది.

ఎవరీ బాలయ్య? సినిమాల్లో గుమ్మడిలాగా, వయసు చిన్నదే అయినా, వయసుకు మించిన పాత్రలు వేస్తూ పరిణతవాణి వినిపించినట్లు, చిన్నక్కా, ఏకాంబరాల తగవులాట తీరుస్తూ పదుగురికి అవసరమైన నాలుగు మంచి మాటలు చెప్పి అందరికీ స్వాంతన కలిగిస్తాడు బాలయ్య. ఈ రేడియో బాలయ్య కీర్తికి అసలు మూర్తి రూపం శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి.

వందలాది రచనల్లోకి, వేలాదిగా వచ్చే ఆలోచనల్ని తర్జుమా చేసి, లక్షలాది శ్రోతల గుండెల్లో తన పలుకుబడిని ఒక సుస్థిర స్థానంగా కల్పించుకున్నారు శ్రీరామచంద్రమూర్తి. రేడియో బాలయ్య కబుర్లకి రచన చేస్తూ ఆ పాత్రకి ప్రసార మాధ్యమంలో పుష్కరమాసం, శ్రోతల గుండెల్లో మాత్రం శతమానం ప్రసాదించిన ఘనత ఆయనది. శ్రవ్య మాధ్యమంలోని ఈ రికార్డు ఈనాటికీ జీడిగుంటవారి పేరుమీదనే పదిలంగా వుంది. శతాధిక కథకునిగా, అడపాతడపా సినిమా రచయితగా ఇలా బహువిధ రచనలు చేసిన రామచంద్రమూర్తిగారు దృశ్యమాధ్యమానికి సంబంధించిన రచనలపై కూడా, ఒక ప్రత్యేకముద్రనే వేశారు అని చెప్పక తప్పదు.

దృశ్య మాధ్యమంలో దూరదర్శన్ ఒక్కటే ఏక చత్రాధిపత్యం చలాయించిన రోజులనుంచీ, రెండు పదులకు చేరువగా తెలుగు ఛానళ్ళు విస్తరించిన నేటిదాకా, ఆయన రచనా ప్రస్థానం గమనార్హమైనది. ఇవాల్టి దూరదర్శన్ తొలి రోజుల్లో, ఉపగ్రహ దూరదర్శన్ కేంద్రంగా వుండేది. ఆ రోజుల్లోనే, మొట్టమొదటి టెలీఫిల్మ్ రచయిత రామచంద్రమూర్తిగారు. 'సమాజమా నీ దారి ఇటు' అంటూ దృశ్యమాధ్యమ రచనలు మార్గ నిర్మాణం చేసిన రచయితగా ఆయన పేరే చెప్పుకోవాలి.

చివరాఖరికి మరొక్కమాట చెప్పాలి. అందుకే మళ్ళీ ముందుకే వస్తున్నాను. 'పొడుగు చేతుల చొక్కాని మోచేతుల వరకూ మడత పెట్టుకుని తొడుక్కునే బదులు, పొట్టి చేతుల చొక్కానే తొడుక్కోవచ్చుకదా' ఇది రామచంద్రమూర్తిగారిని చూసినప్పుడల్లా నాకు అనిపించేది. మూడున్నర పదుల ఏళ్ళనాడు నాకు కలిగిన అమాయకపు సందేహానికి ముప్పై ఐదేళ్ళ తర్వాత తన రచనా సరళి సంవిధానంతోనే సమాధానమిచ్చారు శ్రీ జీడిగుంట. రచన చేసే వేళ ఆలోచనలే ఆంతర్యమంతా పరచుకుని వుండటం, ఆహార్యంలో మాత్రం ఆడంబరాలను దూరంగా ముడుచుకుని వుండటం అనేవి ఉత్తమ లక్షణాలని నావంటి వాళ్ళకు చెప్పకనే చెప్పారు ఆయన.

మృదుభాషణానికి నిలువెత్తు చిరునామా ఈ ఆరడుగుల వెన్నెలమూర్తి. ఆయన రచనలకు చిరకాలం రామచంద్రకీర్తి.

*డా. ఓలేటి పార్వతీశం*

### *సౌజన్యమూర్తి శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి*

మాట, చేత, ప్రవర్తన, అభివ్యక్తీకరణ అన్నిటా శ్రీ జీడిగుంట మితవాది. తాను చెప్పదల్చుకున్న విషయాన్ని సూటిగా, నేర్పుగా, స్పష్టంగా చెప్పగలగటం శ్రీ జీడిగుంట ప్రత్యేక లక్షణం. ఇది చాలా అరుదైన, అభిలషణీయమైన వ్యక్తిత్వ లక్షణం.

ఎందరో మహామహులు హైదరాబాదు ఆకాశవాణిలో పనిచేసేవారు. అందరూ తమ తమ వృత్తిలో ప్రవృత్తిలో విలక్షణమైన శక్తి సామర్థ్యాలు కలవారు. అందరిమధ్యా జీడిగుంట రాణించాడు. అందరి మన్ననలు పొందాడు. కార్మికుల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ కార్యక్రమం, రేడియో నాటకాల నిర్వహణ, సంక్షిప్త చలనచిత్రాల ప్రసారం, కథా నాటకాలు, నవలా నాటకాలు, ప్రసిద్ధ వ్యక్తుల పరిచయం. ఇన్ని వైవిధ్యమైన కార్యక్రమాల నిర్వహణలో శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి, సవ్యసాచిలా నెగ్గుకొచ్చాడంటే ఆయనకున్న సహనం, అవగాహన, వివిధ విషయాలపై సమగ్ర పరిశోధన, పరిశీలన, అబ్బురపరిచే విషయం. ముఖ్యంగా ప్రసార మాధ్యమంలో పనిచేసేవారికి కొంత భేషజం, గర్వం వృత్తిరీత్యా వస్తాయి. కానీ శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి ఆ 'మసి' అంటకుండా జాగ్రత్త పడ్డాడు.

1940లో నిడదవోలులో పుట్టి, మధ్య తరగతి కుటుంబంలో పెరిగి, విద్యాశాఖలో గుమస్తాగా జీవితాన్ని ఆరంభించి, స్వశక్తితో, స్వయంకృషితో, 350 కథలు వ్రాయడం, నాటికలు, నాటకాలు వ్రాయడం, సినిమాలకు కథ, సంభాషణలు వ్రాసి, అవార్డులు, రివార్డులు పొందడం, సాహితీ, సాంస్కృతిక రంగాలలో రాణించి గుర్తింపు పొందడం వెనక గల కృషి వల్ల ఋషిగా ఎదగడం మనం గమనించవచ్చు. అలాంటి అరుదైన వ్యక్తి మనకు తెలిసిన శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి.

కథకుడిగా, నాటక రచయితగా, వివిధ మాధ్యమాలతో పనిచేసేందుకూ పరిణతి సాధించేందుకూ, ఆయన కుటుంబ వాతావరణం బాగా ఉపకరించిందనేది నిర్వివాదాంశం. భార్య, ముగ్గురు కొడుకులూ, మనవలు మనుమరాండ్రు అందరూ సహకరించడం అరుదైన వరం. శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి సాధించిన విజయాలూ, అధిరోహించిన సోపానాలూ అన్నీ అనితర సాధ్యాలు. అందుకే ఆయన పిల్లలు "యు ఆర్ గ్రేట్ డాడీ" అని ప్రస్తుతించారు.

*ఎన్. తారక రామారావు.*

### *రేడియో బాలయ్య*

రేడియో కార్మికుల కార్యక్రమం 'కాంతి కిరణాలు'లో ఓ వెలుగు వెలిగాం.

ఏకాంబరానికి నేనంటే భయం. అతన్ని ముప్పు తిప్పలు పెట్టి ఏడిపిస్తుంటానని అపోహ. అలా సరదాగా ఆటపట్టిస్తున్నప్పుడు సూత్రధారి 'బాలయ్య' వచ్చి అతన్ని రక్షించి మా ఇద్దరికీ క్లాస్‌పీకి మంచి మంచి విషయాలూ, అమూల్యమైన సంగతులూ చెప్పేవాడు. అవి శ్రోతల్ని ఎంతగానో ఆకట్టుకునేవి. ఆ సూత్రధారి బాలయ్యే శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తిగారు.

చిన్నక్క (నేను) ఏకాంబరం (వి. సత్యనారాయణ) బాలయ్య (రామచంద్రమూర్తి) మా ముగ్గుర్నీ శ్రోతలు ఎంతో అభిమానించేవారు. ఎప్పుడైనా ఒక ఆదివారం కార్మికుల కార్యక్రమంలో మాలో ఎవరు రాలేకపోయినా "ఇవాళ ఎందుకు రాలేదబ్బా" అనుకుంటూ శ్రోతలు తమతమ ఇళ్ళలోని కుటుంబ సభ్యుల్లోని ఒకరు కనిపించనంతగా ఆదుర్దా పడేవారు. నిజంగా మేము ధన్యులం కదూ? మా ముగ్గుర్నీ ఆహ్వానించి అనేక ఊళ్ళల్లో సభలు, సన్మానాలు జరిపి శ్రోతలు మమ్మల్ని ఎంతో గౌరవించారు. ఆ మధురమైన రోజులు ఏనాటికీ మర్చిపోలేను. జీడిగుంట రామచంద్రమూర్తి మంచి రచయిత.

అంతేకాదు సహృదయులు, సౌమ్యమూర్తి, సౌజన్యమూర్తి, వినయమూర్తి, ఆయనను గురించి ఎంత చెప్పినా తక్కువే అనిపిస్తుంది.

నాకు అనిపిస్తూంటుంది. 'అసలు రామచంద్రమూర్తి పుడుతూనే కలం చేత్తో పుచ్చుకుని పుట్టారేమో! లేదా అన్నప్రాసన రోజున 'పెన్' గట్టిగా పట్టుకున్నారేమో' అని. ఆయన ఇప్పటికీ అలుపెరుగని 'అక్షర కృషీవలుడు'. తన కథల్లో నవరసాలూ తీర్చిదిద్దిన 'అక్షరశిల్పి'. తమ కథల్లో 'కరుణ రసం' మాత్రం, అద్భుతంగా పండిస్తారు. జాలితో, దయతో మన గుండె బరువెక్కి మనసులో గాఢముద్ర పడిపోతాయి వారి కథలు, నాటకాలు.

ఇటీవల 'అమ్మకోముద్దు' నాటకం రేడియో కోసం నాలుగు భాగాలుగా రచించారు రామచంద్రమూర్తిగారు. నాలుగు వారాలు సీరియల్‌గా ప్రసారమైంది. ఆ నాటకాన్ని నేను నిర్వహించాను. (అంటే దర్శకత్వం నాది) అత్యద్భుతమైన రచన, శైలి. ఒక్కొక్క భాగం రికార్డు చేసేటప్పుడు నేను పొందిన అనుభూతి అపూర్వం. పాత్రధారులంతా తమ తమ పాత్రల్లో లీనమై అద్భుతంగా జీవించారు. చివరి భాగం మధ్యలో, చటుక్కున రికార్డింగ్ ఆపేసి.. ఇంకో ఖాళీ స్టూడియోలోకి వెళ్ళిపోయి కళ్ళు తుడుచుకుని మనసు దిట్టపరచుకుని మళ్ళీ డ్రామా స్టూడియోకి వెళ్ళి ఆర్టిస్టులకు 'సారీ' చెప్పాను. వారంతా కూడా అదే స్థితిలోంచి తేరుకుంటున్నారు. తిరిగి రికార్డింగ్ మొదలు పెట్టి ఆఖరి భాగాన్ని ముగించాను. గుండెలు పిండేసే ఆ సంఘటనలు రచించడం మరొకరికి అసాధ్యం. కానీ అలా వ్రాయగలగటం ఒక్క రామచంద్రమూర్తికే సాధ్యం.

అంత గొప్ప నాటకాన్ని నిర్వహించే అదృష్టం నాకు కలిగించిన మా రేడియో డ్రామా 'పెక్స్' శ్రీ బి. చిట్టిబాబుకి అనేక కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ఏది ఎలా ఉన్నా గొప్ప రచయిత మా 'బాలయ్య' అని మురిసిపోతుంటాను. వారి కలం నుండి ఇంకా ఇంకా అమూల్యమైన రచనలు రావాలని ఆశిస్తూ...

**శ్రీమతి వి. రతన్ ప్రసాద్**
**(రేడియో చిన్నక్క)**

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

COMMENTS